అమృత్ నీరు అందేదెప్పుడు?

టెండర్లు పూర్తయినా.. ప్రారంభం కాని పనులు

న్యూస్‌టుడే, ధర్మపురి


ధర్మపురిలో తాగు నీటి ట్యాంకు

జిల్లాలోని అయిదు పురపాలికల్లో తాగునీటి వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అమృత్ పథకం అమలుకు నోచుకోవడం లేదు. రెండు నెలల కిందటే టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించ లేదు. గుత్తేదార్ల ఎంపిక ప్రక్రియ కూడా జరిగినా పనులను ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపడుతున్న అమృత్ యోజన(అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకం కింద జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. ఏ ఏ పనులు చేపట్టాలో నిర్ణయించి.. టెండర్లు సైతం ఆహ్వానించారు. తాగునీటి పథకాల విస్తరణకు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించేందుకు స్థలాలను ఎంపిక చేశారు. కొన్ని చోట్ల ఆయా ఎమ్మెల్యేలతో శంకుస్థాపనలు చేయగా.. మరికొన్ని చోట్ల ప్రారంభదశలో ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైపులైన్ల నిర్మాణాలు, నల్లా కనెక్షన్లను వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తీరనున్నాయి.

జిల్లాకు రూ.125 కోట్లు

జిల్లాకు అమృత్ 2.0 పథకం కింద తొలి విడత రూ.125.95 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మున్సిపాలిటీల వారిగా జనాభా ప్రతిపాదకన జగిత్యాలకు రూ.35, కోరుట్లకు రూ.37.75, మెట్‌పల్లికి రూ.17.60, రాయికల్‌కి రూ.13.80, ధర్మపురికి రూ.23.00 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవిష్యత్తు జనాభాను అంచనా వేసి.. పైపులైను విస్తరణ, నల్లాలు, ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నారు. జనాభాకు అనుగుణంగా నిధులు విడుదల కావడంతో పట్టణవాసులకు రానున్న రోజుల్లో నీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. పనుల జాప్యంపై ధర్మపురి పుర కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ.. ధర్మపురిలో 23 కి.మీల పైపులైను, 2 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు, 1500 నల్లాలను ఏర్పాటు చేస్తామన్నారు. అమృత్ పథకం కింద ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని. . పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

పోషణ బాధ్యత విస్మరించిన పలువురికి కౌన్సెలింగ్

జగిత్యాల వాణిజ్యం: తల్లిదండ్రుల పోషణను విస్మరించిన పలువురికి జగిత్యాలలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోషణ బాధ్యతను తెలిపి విస్మరిస్తే చట్టపరంగా తీసుకునే చర్యలను వివరించారు. ఏవో తఫజుల్ హుస్సేన్, అశోక్‌కుమార్, విశ్వనాథం పాల్గొన్నారు.

అత్యవసరానికి ఇబ్బందే!

తెరచుకోని పురపాలక శౌచాలయాలు

న్యూస్‌టుడే, జగిత్యాల పట్టణం

బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణంగా జగిత్యాలను తీర్చిదిద్దేందుకు బల్దియా 2022లో పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలు వెచ్చించి శౌచాలయాలను ఏర్పాటు చేసింది. కరీంనగర్‌రోడ్డులో తితిదే స్థలం, రిజిస్ట్రారు కార్యాలయం, అటవీ శాఖ కార్యాలయం, పాతబస్టాండు, ఎడ్ల అంగడి, మహిళా డిగ్రీ కళాశాల పక్కన, మంచినీళ్లబావి ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. టీఎల్ఎఫ్(టౌన్‌లెవల్ ఫెడరేషన్)కు ఒక్కో శౌచాలయం నిర్వహణకు రూ.10 వేల చొప్పున కేటాయించి వాటి బాధ్యత అప్పగించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలున్నాయి. పట్టణానికి వచ్చే వేలాది మందికి ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు.


కరీంనగర్‌రోడ్డు ఎగ్జిబిషన్ మైదానంలో..

ఆర్భాటంగా ప్రారంభం..

శౌచాలయాలను బల్దియా అధికారులు ఆర్భాటంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకముందే ప్రారంభించి వెంటనే తాళాలు వేయడంతో 6 నెలలకుపైగా వినియోగానికి నోచుకోలేదు. మరోవైపు కొన్నింట్లో నిర్మాణ లోపాలు తలెత్తాయి. దీనిపై సర్వత్రా విమర్శలు తలెత్తడంతో గతేడాది పురపాలక ఆమోదంతో మరమ్మతు చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. రెండు శౌచాలయాలను వివిధ కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అటవీశాఖ ముందున్న శౌచాలయాన్ని ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏర్పాటు చేశారు.

అన్నింటినీ మూసేశారు..

పట్టణంలోని 6 శౌచాలయాలను 10 నెలల నుంచి మూసేశారు. నిర్వహణ వ్యయం చెల్లించకపోవడంతోనే మూసివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శౌచాలయాలు పూర్తిగా మూసి ఉండటంతో పట్టణానికి వచ్చే వేలాది మంది మూత్రవిసర్జనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం పట్టణానికి వచ్చే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పురపాలక కార్యాలయంలోని మూత్రశాల కూడా నిర్వహణపరమైన ఇబ్బందులతో మూసివేయడంతో సందర్శకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నిర్మించిన శౌచాలయాలు ప్రజలు అవసరాలు తీర్చడంలో విఫలమవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


విద్యానగర్‌లోని శౌచాలయం

కౌన్సిల్ ఆమోదం లేక నిలిచిపోయింది - చరణ్, ఏఈ, జగిత్యాల పురపాలిక

10 నెలలుగా శౌచాలయాలు మూసి ఉండటం వాస్తవమే. గత ఫిబ్రవరిలో శౌచాలయాల నిర్వహణకు తీర్మానం ప్రవేశపెట్టినా కౌన్సిల్ ఆమోదించలేదు. ఈలోపు ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో తరువాత చర్చిద్దామని అత్యసర సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. తాజాగా టీఎల్ఎఫ్ సంస్థకే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానమైంది. త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన వెంటనే శౌచాలయాలను అందుబాటులోకి తెస్తాం.

గ్రూప్-I పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు

జగిత్యాల, న్యూస్‌టుడే: గ్రూప్-1 పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్లతో దృశ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్-1తోపాటు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి సమీక్ష పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 11 వేల మంది అభ్యర్థుల కోసం 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి, ఆర్డీవో పి.మధుసూదన్, అదనపు ఎస్పీ భీంరావు, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.


దృశ్య సమీక్షలో కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలి

జగిత్యాల: జిల్లాలో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల తులసినగర్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిఖం భూములు, ఇతర ఇబ్బందులు లేని భూములను వెంటనే క్రమబద్ధీకరించాలని పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఆర్డీవో పి.మధుసూదన్, పురపాలక కమిషనర్ బి.చిరంజీవి తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సదస్సుకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి సైన్స్ సదస్సు స్థానిక టీచర్స్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న సెమినార్‌లో ఉత్తమ విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన 9 తరగతి విద్యార్థిని కె.మనస్వి ప్రథమస్థానంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ద్వితీయస్థానంలో కేజీఆర్ ఉన్నత పాఠశాల 8 తరగతి విద్యార్థి లోకేష్, తృతీయ స్థానంలో మానస విద్యార్థిని ఎ.హర్షిత, నాలుగోస్థానంలో నవజ్యోతి పాఠశాల కోరుట్ల విద్యార్థిని రిత్విక్ ఎంపికైనట్లు విద్యాశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.


పరుగు పందెంలో క్రీడాకారులు

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో 14, 17 ఏళ్లలోపు బాలబాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు, టౌన్‌హాల్‌లో జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ అశోక్ బహుమతులు అందచేశారు. విద్యాధికారి బి.జగన్‌మోహన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు క్రిష్ణప్రసాద్, అంజయ్య, పుష్పలత, వెంకటలక్ష్మి, సాగర్, వేణు, భాస్కర్, భూమేశ్చ తదితరులు పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

శాతవాహన ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్





ఈనాడు, కరీంనగర్

ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..

ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.

రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలు చోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..

గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

వంతెనల నిర్మాణాలకు మోక్షం

కోరుట్ల నియోజకవర్గంలో రూ.14.30 కోట్లు మంజూరు

న్యూస్‌టుడే, కోరుట్ల, మెట్‌పల్లి

కోరుట్ల పట్టణ శివారులోని జంబిగద్దె వద్దనున్న పెద్దవాగుపై వంతెన నిర్మాణ పనులను 2017 జనవరిలో రూ.2.80 కోట్ల నాబార్డు నిధులతో ప్రారంభించారు. వాగులో పిల్లర్లు, చెక్‌డ్యాం కోసం వాల్ నిర్మించి వదిలేశారు. తర్వాత సంబంధిత అధికారులు అదనపు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గతేడాది ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టలేదు. వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి ఏడున్నరేళ్లు గడుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం రూ.3.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతోనైనా పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణం జరిగితే పట్టణ, కోరుట్ల, కథలాపూర్ మండలాల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.



కోరుట్ల మండలంలోని ఏఖీన్‌పూర్ శివారులోని పెద్దవాగుపై 2017లో నాబార్డు నిధులు రూ.2.12 కోట్లతో వంతెన, చెక్‌డ్యాం నిర్మాణం పనులు ప్రారంభించి పిల్లర్లు నిర్మించారు. 2021లో రూ.2 కోట్ల నిధులు కేటాయించడంతో స్లాబ్‌వేసి ఇరువైపులా గోడలు నిర్మించారు. రెండేళ్లుగా వాగులో ఉద్ధృతంగా వరద రావడంతో వంతెనకు ఓవైపు నిర్మించిన గోడలు కూలిపోవడంతో పాటు వాగు ఒడ్డునున్న భూమి పెద్దఎత్తున కోతకు గురైంది. గతేడాది ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినా విడుదల కాకపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం పూర్తయితే సంగెం, నాగులపేట, కథలాపూర్ మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.



కోరుట్ల నియోజకవర్గంలో వంతెనల నిర్మాణాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాల్లో అయిదు వంతెలనకు సీఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.14.30 కోట్ల నిధులను విడుదల చేసింది. వంతెన నిర్మాణాలు పూర్తయితే ఏళ్లతరబడి నెలకొన్న ఇబ్బందులు తొలగనున్నాయి.

✦ మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆగస్టు 22, 2023న శంకుస్థాపన చేశారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మండలంలోని కోనరావుపేట, కథలాపూర్ మండలాలకు రాకపోకలకు మార్గం సుగమమవుతుంది.

✦ మల్లాపూర్ వడ్డెర కాలనీ వద్ద వంతెన నిర్మాణానికి గతేడాది ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను చేపట్టకుండా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ వాగుపై లోలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.2.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. అనంతరం అప్పటి ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాన చేశారు. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులను ప్రారంభించలేదు. ప్రస్తుతం రూ.2.80 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వంతెన నిర్మాణం చేపడితే రామారావుపల్లె, కోరుట్ల పట్టణం, కోరుట్ల, కథలాపూర్, వేములవాడ ప్రాంతాలకు అక్కడి ప్రాంత ప్రజలు వెళ్లడానికి దూరాభారం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

రంగంలోకి ఆడిట్ బృందాలు!

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవినీతిపై లోతుగా విచారణ

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన అవినీతిపై లోతుగా విచారణ జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం విచారణ బృందాలను నియమించింది. రాష్ట్రంలోని 149 ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రీస్కూల్ కిట్లు, అడిషనల్ మెటీరియల్ కిట్ల సరఫరా బాధ్యతను 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని మహిళా శిశు సంక్షేమశాఖలకు అప్పగించి టెండర్ల నిర్వహణకు వెసులుబాటు కల్పించింది. జిల్లాలోని మెట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో కిట్ల సరఫరాలో అవకవతవలు జరిగాయని గత జూన్‌లో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అవినీతి జరిగినట్లు నిర్ధారణ కావడంతో మెట్‌పల్లి సీడీపీవోను జిల్లా కలెక్టర్ గత జూన్ 8న ప్రభుత్వానికి సరెండర్ చేశారు. జిల్లాలోని జగిత్యాల, మల్యాల, ధర్మపురి ప్రాజెక్టుల పరిధిలో ప్రీస్కూల్ కిట్లలోని అన్ని వస్తువులు, పరికరాలు సరఫరా కాలేదని, అడిషనల్ మెటీరియల్ కిట్లు అసలుకే సరఫరా చేయలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమాలకు తెరలేపిన తీరుపై గత జులై 13న 'ఐసీడీఎస్‌లో అవకతవకలు' శీర్షికన జగిత్యాల జిల్లాలో కథనం ప్రచురితమైంది. స్పందించిన మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ క్రాంతి వెస్లీ విచారణ చేపట్టగా జగిత్యాల జిల్లాకు కిట్లు సరఫరా చేసిన గుత్తేదారే మొత్తం 10 జిల్లాలకు సరఫరా చేసినట్లు గుర్తించారు. దీంతో రాష్ట్రంలోని 149 ప్రాజెక్టుల పరిధిలో కిట్ల సరఫరా, టెండర్లు నిర్వహించిన తీరు, కిట్ల సరఫరాలో గుర్తించిన లోపాలు, 2018-19లో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖలో విధులు నిర్వహించిన సంబంధిత డీడబ్ల్యూవోలు, సూపరింటెండెట్లు తదితర వివరాలు సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఆయా జిల్లాల స్థాయిలో ప్రాజెక్టుల వారీగా చేపట్టిన విచారణలో కొంత మేరకు పురోగతి సాధించినప్పటికీ పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. సీడీపీవో కార్యాలయాల రికార్డుల్లో దిద్దుబాట్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఎంట్రీ రిజిస్టర్లలో ప్రీస్కూల్, అడిషనల్ కిట్ల సరఫరా వివరాల్లో స్పష్టత లేకపోవడం తదితర అంశాలు గుర్తించారు. అయితే రాష్ట్ర స్థాయిలో రెండు, మూడేళ్లకు ఓసారి అంతర్గతంగా ఆడిట్ నిర్వహిస్తుండగా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సాధారణ ఆడిట్‌తో పాటు, అవకతవకలపై కూడా ప్రత్యేక విచారణ జరిపేందుకు రెండు వారాల కిందట ఆడిట్ బృందాలను నియమించారు. మొత్తం 12 ఆడిట్ బృందాలు విచారణ చేపట్టనుండగా ఒక్కో బృందం మూడు, నాలుగు జిల్లాల్లో పర్యటించి విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

ప్రతిపాదనలకు ఆమోదం లభించేనా!

న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

జగిత్యాల పట్టణంలోని కొత్తబస్టాండు ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే సిద్ధం చేసిన ప్రణాళికను ఆర్టీసీ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించగా, ఆమోదం లభించగానే చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు చేస్తోంది.

ప్రణాళిక ఇదీ..

బస్సులు ప్రాంగణంలోకి వెళ్లే ఇన్‌గేట్ అలైన్‌మెంట్ చేసి ద్విచక్రవాహనాలు లోపలికి వెళ్లేందుకు వీలుగా ఇన్‌గేట్‌కు పక్క నుంచి ప్రత్యేకంగా దారి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పార్శిళ్ల బుకింగ్, స్వీకరణ కోసం వచ్చే వినియోగదారులు, ప్రాంగణంతో సంబంధం లేకుండా నేరుగా వచ్చేలా అదనపు సులభ్ కాంప్లెక్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కార్గో కేంద్రం ఏర్పాటు చేయాలని నివేదికలో పేర్కొన్నారు. అదనపు సులభ్ కాంప్లెక్స్ పక్కన రోడ్డుకు ఆనుకొని 15 గుంటలకు పైగా అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా, ఈ స్థలాన్ని అయిదేళ్ల కిందట టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు ఆర్టీసీ కేటాయించడంతో పార్కింగ్ కేంద్రం ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది.


కొత్తబస్టాండు ప్రయాణ ప్రాంగణం

సమస్యలు ఇవీ...

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రయాణ ప్రాంగణం ఆవరణలోనే ద్విచక్రవాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారు. నిత్యం 300 వరకు వాహనాలు పార్కింగ్ కోసం వస్తుండగా, బస్సుల రాకపోకల మధ్య వాహనదారులు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉంది. అనుమతి లేకుండా కొందరు బస్టాండు ఆవరణలో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడం ప్రమాదాలకు తావిస్తోంది. దీనికి అదనంగా ఆర్టీసీ సరకులు రవాణా చేస్తున్న కార్గో బుకింగ్ కేంద్రం సైతం ప్రాంగణం ఆవరణలోనే ఉండటం మరింత ఇబ్బందిగా మారింది. మరోవైపు ఖాళీ స్థలంలో పందులు, పశువులు, మురుగు కారణంగా పారిశుద్ధ్య నిర్వహణ కష్టసాధ్యంగా మారింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు - సునీత, డిపో మేనేజర్, జగిత్యాల

ప్రయాణ ప్రాంగణ ఆవరణలో నెలకొన్న సమస్యలు, పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. ఆమోదం లభించగానే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా ప్రజాప్రతినిధులు చొరవ చూపితే ప్రతిపాదనలు సత్వరం కార్యరూపంలోకి వచ్చే అవకాశం ఉంది.

21 నుంచి పోలీసు అమరుల సంస్మరణ కార్యక్రమాలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 21న పోలీసు ఫ్లాగ్‌డే సందర్భంగా అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 21న స్మృతి పరేడ్ నిర్వహించి అమరవీరుల త్యాగానికి నివాళులర్పిస్తామని, జిల్లా వ్యాప్తంగా 10 రోజులపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో దృశ్య మాధ్యమం ద్వారా పోలీసుల ఆయుధాలు, విధులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని అన్ని మండల పోలీసుస్టేషన్లకు విద్యార్థులను ఆహ్వానించి చూపిస్తామన్నారు. ఇంటర్ వరకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్‌వాడకంపై, డిగ్రీ విద్యార్థులకు తెలంగాణలో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నాపాత్ర అనే అంశాలపై ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, 28 వరకు అవకాశముందన్నారు. ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలుంటాయని ఈనెల 20వ తేదీల్లో సమీప పోలీసుస్టేషన్లలో అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రక్తదానశిబిరాలు, సైకిల్ ర్యాలీలు, కళాబృందాలతో పాటల కార్యక్రమాలు చేపడుతామని ఎస్పీ వివరించారు.



వలస జీవుల ఆరోగ్యంతో వైద్య కేంద్రాల చెలగాటం

- ఏజెంట్లు, ల్యాబ్ నిర్వాహకుల దందా
- టీకాలు వికటించి ఆసుపత్రి పాలవుతున్న వైనం

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు సగటున 300 నుంచి 500 మంది ఇతర దేశాలకు వలస వెళ్తుంటారు. ఎలాంటి రుగ్మతలు లేకుంటేనే ఆయా దేశాలు వీసాలు మంజూరు చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు లేవని నిర్ధారించుకోవడంతోపాటు ఆయా దేశాలు సూచించిన టీకాలు తీసుకోవాలి. వీటిని ధ్రువీకరించాక వీసా మంజూరవుతుంది. హైదరాబాద్ నారాయణగూడలోని ప్రభుత్వ ఐపీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్), జీఏఎంసీఏ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ అప్రూవ్ మెడికల్ సెంటర్స్ అసోసియేషన్) కేంద్రాల్లో వైద్య పరీక్షలు, టీకాలు ఇస్తారు. ఐపీఎంలో రూ.30 చెల్లించి తమ వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో సూచించిన సమయానికి వెళ్తే ఉచితంగా టీకా ఇస్తారు. ఇక్కడ 26 రకాల టీకాలు అందుబాటులో ఉంటాయి. ఇక జీఏఎంసీఏలో ఒక్కరికి రూ.7,500 ఫీజు చెల్లించాలి.

✦ దుబాయ్, సౌదీ, ఒమన్, కువైట్, సింగపూర్, మలేషియా, అఫ్గానిస్థాన్ తదితర దేశాలకు వెళ్లేవారు వైద్య పరీక్షలు, టీకాలపై అవగాహన లేక పూర్తిగా ఏజెంట్లను నమ్ముతారు. వారు అడిగినంత ఇచ్చి మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కనీసం వెయ్యి మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ లెక్కన నెలలో లక్షల రూపాయలు వైద్య పరీక్షల పేరిట వ్యాపారం జరుగుతోంది. వాస్తవంగా ఈ తరహా వైద్య పరీక్షలన్నీ ప్రభుత్వ ఐపీఎం కేంద్రంలో రూ.30 స్లాట్‌తో అయిపోతాయి. వీటిపై అవగాహన లేని వలస జీవులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు.

ఉపాధి బాటలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి బలహీనత ఆసరాగా చేసుకుని వైద్య పరీక్షలు, టీకాల పేరిట కొందరు ఏజెంట్లు దండుకుంటున్నారు. ఎక్కువ కమీషన్‌కు ఆశ పడి అనుమతి లేని కేంద్రాల్లో పరీక్షలు చేయిస్తున్నారు. అక్కడ సరైన నిబంధనలు పాటించక టీకాలు వికటించి అనారోగ్యం బారిన పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఏజెంట్లకు ముట్టజెప్పి, పొరుగు దేశాలకు వెళ్లిన వారు అక్కడ పని చేయలేని స్థితిలో ఇంటిబాట పడుతున్నారు. డబ్బులు పోయి, అనారోగ్యంతో ఉపాధి లేక వలస జీవులు అవస్థలు పడుతున్నారు.

✦ హైదరాబాద్‌లోని ఐపీఎంతోపాటు జీఏఎంసీఏ అనుమతి ఉన్నవి ఎనిమిది కేంద్రాలు ఉన్నాయి. అనుమతి లేని మెహదీపట్నం, హిమాయత్‌నగర్, చార్మినార్, పాతబస్తీ ప్రాంతాల్లో చాలా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో టీకాలు ఇచ్చేవారి చేతులు, సూది మందు ఇచ్చే ప్రాంతంలో చర్మాన్ని శుభ్రం చేయాలి. చర్మం పొరలోనే సూది మందు ఇవ్వాలి. కాని అపరిశుభ్రతతో చొక్కా పైనుంచి సూది ఇవ్వడం, అదీ చర్మం లోపలికి వేయడంతో కొన్ని రోజులకు సూది వేసిన చోట ఇన్‌ఫెక్షన్ ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల, వేములవాడ, కరీంనగర్‌లలో ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న వారు రోజు రోజుకు పెరుగుతున్నారు.

డబ్బులు ఖర్చయ్యాయి.. ఉపాధికి దూరమయ్యా..

- కారెంగుల రంజిత్‌కుమార్, సంగెం, కోరుట్ల మండలం



నేను కోరుట్లలో టైల్స్ నిర్మాణంలో పని చేస్తున్నాను. బహ్రెయిన్ వెళ్లేందుకు మెట్‌పల్లిలోని ఏజెంటుకు వీసా కోసం రూ.40 వేలు, వైద్య పరీక్షలకు రూ.7,200 చెల్లించాను. హైదరాబాద్ మెహదీపట్నంలోని ఎస్‌కే మెడికల్స్‌లో జూన్ 28న వెళ్లి వైద్య పరీక్షలు, టీకా చేయించుకున్నాను. పదిహేను రోజులకు టీకా వేసిన ప్రాంతంలో వాపుతోపాటు నొప్పి ఎక్కువైంది. స్థానిక వైద్యులను సంప్రదిస్తే, పరీక్షలు చేసి టీకా వికటించిందని శస్త్రచికిత్స చేశారు. పది రోజులకు తిరిగి నొప్పి రావడంతో రెండోసారి శస్త్రచికిత్స చేశారు. ఇప్పటికీ రూ.30 వేల పైనే ఖర్చయింది. వీసా వచ్చినా గడువు ముగియడంతో వెళ్లలేకపోయాను. టీకా ఇచ్చిన కేంద్రంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

కంపెనీకి డబ్బులు చెల్లించి ఇంటికి వచ్చా

- పోతుగంటి చంద్రశేఖర్, సంగెం, కోరుట్ల మండలం




ఆరు నెలల క్రితం ముంబయి ఏజెంటు సాయంతో క్లీనింగ్ సూపర్‌వైజర్ పని మీద సౌదీ వెళ్లాను. అక్కడికి వెళ్లిన రెండు నెలలకు టీకా తీసుకున్న ప్రాంతంలో నొప్పి రావడంతో అక్కడి వైద్యులను సంప్రదించాను. టీకా వికటించింది సర్జరీ చేయాలని సూచించారు. కంపెనీ వారు వేతనం ఇవ్వలేదు. నా దగ్గర చికిత్సకు డబ్బులు లేవు. కంపెనీకి అదనపు డబ్బులు చెల్లించి వచ్చాను. ఇప్పటికీ రెండు శస్త్రచికిత్సలు అయ్యాయి. మొత్తంగా రూ.4 లక్షలు ఖర్చయ్యాయి. ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీకా కేంద్రంపై చర్యలు తీసుకోవాలి.

పత్తి విక్రయాలకు సాంకేతిక దన్ను

న్యూస్‌టుడే, జమ్మికుంట

మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందస్తుగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.



వాట్సాప్‌లో పత్తి రైతుకు కనిపించే వివరాలు

రైతులు ఏం చేయాలంటే..

✦ సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 8897 281111ను సేవ్ చేసుకోవాలి.

✦ ఆ నంబర్ వాట్సాప్‌లో 'హాయ్' అని టైపు చేయాలి.

✦ వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.

✦ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలు కనిపిస్తాయి.

✦ కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.

✦ భాషను ఎంపిక చేసుకోగానే పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.

✦ పత్తి విక్రయానికి సంబంధించి రైతు వివరాలు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.





పసిడి భానుడు.. వెన్నెల రేడు

నీలి మేఘాల మధ్య నుంచి భానుడి లేలేత కిరణాలతో పచ్చటి పంటలు పసిడి వర్ణాన్ని అద్దుకోగా చుట్టూ ఆకాశం ఎరుపు రంగులో తళుకులీనుతోంది. నీకు నేను పోటీ అంటూ పున్నమి చంద్రుడు ఎదురుగా వెన్నెల కాంతులు కురిపించాడు. శుక్రవారం తెల్లవారుజామున కమాన్‌పూర్ మండలం గుండారం పంచాయతీ రాజాపూర్ వద్ద పంట పొలాల్లో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

చోటు కోసం పోటాపోటీ!

- పల్లెల్లో 'ఇందిరమ్మ కమిటీ'ల కలవరం

ఈనాడు, కరీంనగర్

స్థానిక సంస్థల ఎన్నికల విషయం పక్కకు వెళ్లి.. ప్రస్తుతం పల్లెల్లో ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం చర్చ జరుగుతోంది. 'నాకంటే.. నాకు' అవకాశమివ్వాలన్న విజ్ఞప్తులు పెరుగుతుండటంతో అధికార పార్టీ నాయకులకూ తలనొప్పి వ్యవహారంగా మారింది. నాలుగు జిల్లాల పరిధిలో ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. అన్ని జిల్లాల కలెక్టర్ల చేతికి చేరిన ఈ ప్రతిపాదనలను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించిన తరువాత అధికారికంగా ప్రకటిస్తారు. కానీ చాలా గ్రామాల్లో ఇందులో చోటు దక్కించుకునేందుకు చోటామోటా నాయకులు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల ఏకాభిప్రాయాలతో సభ్యుల పేర్లు వెళ్లినప్పటికీ ఇంకొన్ని చోట్ల మాత్రం సీనియర్లు, జూనియర్లనే తారతమ్యంతో రెండు, మూడు జాబితాలు ఉన్నతాధికారులకు అందాయి.

ఆగమేఘాల మీద..

ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నాటికి ఎంపిక పూర్తి చేయాల్సి ఉండటంతో క్షేత్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలోనూ ఉమ్మడి జిల్లాలో 7,18,756 మంది అర్జీలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున 12 నియోజకవర్గాలకు 42 వేలు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలిచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.

ఏడుగురికి అవకాశం!

ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్‌గా గ్రామ సర్పంచి, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో ప్రస్తుతం ఛైర్మన్‌గా ప్రత్యేకాధికారి ఉంటారు. పుర, నగరపాలికల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా ఉండనున్నారు. కన్వీనర్‌గా వార్డు అధికారికి చోటిస్తారు. వీరు కాకుండా కమిటీలో మరో అయిదుగురు స్థానికుల్ని తీసుకుంటారు. ఇందులో ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో చాలా గ్రామాల్లో ఈ పార్టీకి చెందిన వారే ఈ కమిటీల్లో చోటు కోసం పోటీపడ్డారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో కమిటీలది కీలకపాత్ర కావడం, తరువాత పథకంలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ లబ్ధిదారులకు అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించే అవకాశం కావడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

వివాదం తప్పదా!

ఎంపికకు ముందే అటు కాంగ్రెస్ ఇటు భారాస నాయకుల మధ్య అక్కడక్కడా వివాదం మొదలైంది. హుజూరాబాద్‌లో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల నుంచి ఈ కమిటీల్లో పలువురికి చోటివ్వాలని ప్రతిపాదనలు ఎంపీడీవోలకు అందించారు. భారాస ఎమ్మెల్యేలున్న కరీంనగర్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఇదే తరహాలో ప్రతిపాదనలు పలు కమిటీల విషయంలో అందాయి. ముఖ్యంగా పురపాలిక, నగరపాలక సంస్థల్లో భారాస కార్పొరేటర్లు ఎక్కువగా ఉన్నారు. వారు పేర్లు ఇస్తుండగా అటు కాంగ్రెస్ వారు కూడా పోటీగా మరో ప్రతిపాదనను ఇస్తుండటంతో ఏది తుది జాబితాగా మార్చాలనే సందిగ్ధంలో అధికారులుంటున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తరువాత అసలు కమిటీల్లో ఎవరుంటారనేది తేలనుంది.

23 నుంచి 26 వరకు డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసెట్)-2024 ఉత్తీర్ణులై, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు డీ.ఎల్.ఎడ్./డీపీఎస్‌ఈ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎల్‌ఎండీ కాలనీ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోలేకపోయిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 21న తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. యార్డుకు శుక్రవారం 174 ట్రాలీల కొత్త విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్ ఆరంభం నుంచి ఎక్కువ పత్తి విక్రయానికి రావటం ఇదే ప్రథమని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇతర మార్కెట్లలో పత్తి విక్రయాలు మొదలు కాలేదు. జమ్మికుంట మార్కెట్‌లో గత నెల 18 నుంచి కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం ట్రాలీల వారీగా బిడ్డింగ్ నిర్వహించారు. కొత్త విడిపత్తికి కనిష్ఠంగా రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ధర పలికింది. 38 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు. గురువారం కంటే తాజాగా ధర రూ.50 తగ్గింది. స్థానిక ద్వితీయ శ్రేణి వ్యాపారులతోపాటు ఇద్దరు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు పత్తిని ఖరీదు చేయగా.. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శులు ఆర్.మల్లేశం, రాజాలు పరిశీలించారు.

స్వయం ఉపాధికి చేయూత

ఎస్‌బీఐ ఆర్‌సెటిలో కంప్యూటర్ ట్యాలీపై ఉచిత శిక్షణ

న్యూస్‌టుడే, తిమ్మాపూర్

గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఎస్‌బీఐ ఆర్‌సెటి అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు వ్యాపార సాధన నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ ఉచిత శిక్షణ ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

30 రోజులపాటు..

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో 2010 సంవత్సరంలో నెలకొల్పిన ఎస్‌బీఐ ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ)లో ఈ నెల 23 నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుంది.
- ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల (18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన) పురుషులు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 22వ తేదీ లోపు సంస్థలో సంప్రదించాలి.
- కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 30 రోజుల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.
- శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు ఉచిత వసతిని అందిస్తారు.



మహాత్మానగర్‌లోని ఎస్‌బీఐ ఆర్‌సెటి సంస్థ

యువత సద్వినియోగం చేసుకోవాలి

- డి.సంపత్, సంస్థ, డైరెక్టర్

సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం ధ్రువపత్రాన్ని అందజేయడంతోపాటు వ్యాపార రంగానికి సంబంధించిన రుణాన్ని బ్యాంకు ద్వారా అందజేస్తున్నాం.

వరద కాలువకు నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి వరదకాలువకు శుక్రవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఈ నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ప్రాజెక్టులోకి 23,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800, ఇతర కాలువలు, మిషన్ భగీరథ, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఇన్‌ఫ్లోకు సమానంగా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తూ ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు.



హెడ్‌రెగ్యులేటర్ నుంచి వరదకాలువకు విడుదలవుతున్న నీరు

తేలికపాటి వర్షసూచన.. ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు పొలాస పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. వర్షసూచన ఉన్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకంపై హర్షం

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ దండ రాజిరెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన దండ రాజిరెడ్డి గతంలో జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో శాస్త్రవేత్తగా పనిచేయగా అల్దాస్ జానయ్య జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేశారు. ఉమ్మడి జిల్లాతో అనుబంధంగల ఇద్దరు వ్యక్తులు రెండు వర్సిటీలకు వీసీలుగా నియమితులు కావటంపై సాగురంగానికి మేలు కలిగిస్తుందని ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్, డాక్టర్ మంజులత, డాక్టర్ శ్రీధర్‌సిద్ధి, వెల్మల రాంరెడ్డి, వంగల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

చిన్నారులకూ ఏకరూప దుస్తులు

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీకి సిద్ధం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్

పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే ఏకరూప దుస్తులను ఇక నుంచి అంగన్‌వాడీ పిల్లలకూ అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిట్టి, పొట్టి చిన్నారులు ఇక నుంచి ఏకరూప దుస్తుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తరహాలో అంగన్‌వాడీ చిన్నారులు కనిపించనున్నారు. ప్రభుత్వం వస్త్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రాలకు అందజేసింది. ఈ వస్త్రంతో మహిళా సంఘ సభ్యులు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేశారు. కొన్ని రోజుల్లో చిన్నారులకు అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
జగిత్యాల	1065	63,835
కరీంనగర్	777	43,736
సిరిసిల్ల	587	34,376
పెద్దపల్లి	706	35,112

మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు..

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించటంతోపాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య నేర్పించటానికే మూడు దశాబ్దాల క్రితం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు చిన్నారులు వివిధ రకాల దుస్తులు ధరించి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి వారు ఏకరూప దుస్తులు ధరించి అంగన్‌వాడీలకు రావాల్సి ఉంటుంది. బాలురకు చొక్కా, నెక్కరు, బాలికలకు గౌను ఆకర్షణీయంగా డిజైన్ చేయటంతో అదే తరహాల్లో దర్జీలు కుడుతున్నారు. ఒక్కో జత కుట్టేందుకు రూ.80 నుంచి రూ.100 వరకు ప్రభుత్వం వారికి చెల్లిస్తుంది. దర్జీ పనులు ఇప్పటి వరకు 99 శాతం పూర్తయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పంపిణీ చేయనున్నారు.



చిన్నారుల దుస్తుల నమూనా

మంచి డిజైన్లతో కుట్టాం

మాకు అప్పగించిన వస్త్రాలను చిన్నారుల కొలతలకు తగినట్లుగా, వివిధ రకాల డిజైన్లతో షర్టులు, నెక్కర్లు, గౌన్లు కుట్టాం. నాణ్యత ప్రమాణాలు పాటించాం. మాకు అప్పగించిన వస్త్రాన్ని మొత్తం కుట్టడం పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించాం.

- దీప్తి, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు, కరీంనగర్

త్వరలోనే పంపిణీ

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయింది. త్వరలోనే కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేయనున్నాం. దుస్తుల పంపిణీతో కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య సైతం పెరుగుతుందని ఆశిస్తున్నాం. మొదట 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయసుగల చిన్నారులకు పంపిణీ చేయనున్నాం.

- సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి, కరీంనగర్

న్యూస్‌టుడే, రాయికల్

? రాయికల్ పాతబస్టాండు నుంచి మత్తడివాడ వరకు సీసీ రహదారి మంజూరైనా పనులు ప్రారంభించడం లేదు. - రాజు, రాయికల్

✓ గుత్తేదారుతో మాట్లాడి సీసీ రహదారుల నిర్మాణం త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. - జగదీశ్వర్‌గౌడ్, పురపాలిక కమిషనర్

న్యూస్‌టుడే, కోరుట్ల

? కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్, నందిచౌక్ వద్దనున్న ట్రాఫిక్ సిగ్నల్‌లు కొన్ని వారాలుగా పని చేయడం లేదు. సిగ్నల్ వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
-సుతారి నవీన్‌కుమార్, కోరుట్ల

✓ ట్రాఫిక్ సిగ్నల్‌ల టైమర్‌లు దెబ్బతిన్నాయి. మరమ్మతు చేయిస్తున్నాం. త్వరలోనే రెండు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్‌లు వెలిగేలా చూసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం.
-బట్టు తిరుపతి, కమిషనర్

మెట్‌పల్లి మార్కెట్ కమిటీపై ఉత్కంఠ

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: రైతులు, వ్యాపారులకు మధ్య అనుసంధానంగా ఉంటూ అన్నదాతలకు మేలు చేకూర్చేలా వ్యవసాయ మార్కెట్ కమిటీలు పని చేయాలి. పంటల క్రయ, విక్రయాలు జరిగే సమయంలో మద్దతు ధర పర్యవేక్షణ, యార్డులో ఏర్పాట్లు, రైతులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తోంది. పాలకవర్గ పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కోరుట్ల నియోజకవర్గంలో నాలుగు మార్కెట్ కమిటీలుండగా, మూడింటికి పాలకవర్గాల నియామకం పూర్తయింది. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంపై ఉత్కంఠ కొనసాగుతోంది.



మెట్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయం

మెట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. కమిటీ ఛైర్మన్ పదవి జనరల్‌కు రిజర్వ్ కాగా పదవులు పొందేందుకు ఆశావహులు నేతలను కలుస్తూ ప్రయత్నాలు చేపడుతున్నారు. పదవుల కోసం అధికార పార్టీలో రెండు వర్గాలుగా ప్రయత్నాలు చేయడంతో పాలకవర్గ నియామకంలో జాప్యం జరుగుతుందన్న ప్రచారం ఉంది. నియోజకవర్గంలో మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలు ఉండగా మెట్‌పల్లి మినహా మూడు మండలాల పాలకవర్గాలను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది. మూడు మార్కెట్ కమిటీల పాలకవర్గాల ఛైర్మన్ పదవులు ఓ నేత సూచించిన వారికే దక్కినట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. మెట్‌పల్లి కమిటీ పదవికి మాత్రం రెండు వర్గాల నుంచి ఇద్దరు నాయకులు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతుండగా పార్టీ వెన్నంటి ఉన్న కొందరు కూడా ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. డివిజన్ కేంద్రం కావడంతో అందరి దృష్టి దీనిపైనే ఉంది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఎవరికి కేటాయిస్తారనేదీ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.


ఏఖీన్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు రాతపుస్తకాల పంపిణీ

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్యాంప్ కార్యాలయంలో కేక్ కోసి స్వీట్లు పంపిణీ చేశారు. ఏఖీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. దారిశెట్టి రాజేష్, కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, అంజయ్య, భాస్కర్‌రెడ్డి, ఫయిమ్, మురళి, నజ్జు, బాబా, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌కు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.


భారాస అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే డా.సంజయ్

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సంజయ్ పుట్టినరోజు వేడుకలను భారాస శ్రేణులు నిర్వహించారు. మల్లాపూర్‌లో పేద మహిళలకు చీరలు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. రాఘవపేటలో విద్యార్థులకు రాతపుస్తకాలను అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదినం సందర్భంగా మెట్‌పల్లిలో శుక్రవారం భారాస నాయకులు కేక్ కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, నాయకులు సత్యనారాయణ, ఒజ్జల శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. జగ్గాసాగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేశారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు సూచించారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ మినీ స్టేడియంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి యువకులు పోటీల్లో పాల్గొన్నారు. సీఐ నిరంజన్ రెడ్డి, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్సైలు చిరంజీవి, రాజు, అనిల్, కిరణ్‌కుమార్, శిక్షణ ఎస్సై సతీష్, ఆల్‌రౌండర్ గంగాధర్, లక్ష్మీనారాయణ, బారి, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం ఆపాలని వినతి

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 20వ వార్డు స్వయంభూ హనుమాన్ ఆలయం వద్ద చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని 8, 9, 10, 20 వార్డుల కాలనీవాసులు బల్దియా కమిషనర్ మోహన్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. వుజగిరి శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్, శేఖర్, కృష్ణబాబు, తేజ, నరేష్, కళ్యాణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పలు పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గుండెల నరేష్, విద్యామణి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని పాఠశాలలుల, కళాశాల, కస్తూర్బాలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని, ఫాం-19ను అందజేశారు. ప్రిన్సిపల్ వై.రమేష్‌బాబు, గోవర్ధన రయ్య, సంగ శ్రీధర్, రాజనర్సయ్య, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ నాయకులు అన్నారు. రాయికల్ మండలంలోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ, గురుకుల పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులను కలిసి ఓటు హక్కు నమోదు పత్రాలను అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, గంగరాజం, రాపర్తి నర్సయ్య, గాజంగి రాజేశం, తాటిపల్లి వేణుగోపాల్, లక్కాడి రాజరెడ్డి, రాజమహ్మద్, తదితరులున్నారు.


కొత్తపేటలో ఓటరు నమోదు చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో రెండు పడక గదుల నివాస సముదాయంలో రూ.14 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.6.35 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతితో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ముప్పాల రాంచందర్‌రావు, గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, బాలముకుందం పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఛైర్‌పర్సన్ జ్యోతి

బస్సు నడిపించాలని ఎమ్మెల్యేకు వినతి

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి, పోతారం గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిపించేలా చూడాలని గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్‌ను కలిసి కోరారు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ గ్రామానికి బస్సు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని, ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నడిపించేలా చూస్తానని గ్రామస్థులకు హామీచ్చారు. ప్రేమానందం, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు, శ్రీనివాస్, రాజేందర్, నారాయణరావు, ఆదర్శ్, తదితరరులు పాల్గొన్నారు.

దారి నిర్మాణంలో భూమి పోతోందని ఆందోళన

గొల్లపల్లి, న్యూస్‌టుడే: పొలంలో దారి కోసం చేసే నిర్మాణ పనుల్లో తమ భూమి పోతోందంటూ బీబీరాజ్‌పల్లికి చెందిన నును గొప్పుల నరేష్ కుటుంబ సభ్యులు గొల్లపల్లి తహసీల్దార్ కార్యాయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. గతంలో సాగునీటి కాలువ కోసం సుమారు ఏడు గుంటల భూమి కోల్పోయానని మళ్లీ తోవ కోసం తమ భూమిలోనే అధికారులు సర్వే చేస్తున్నారని బాధితుడు వాపోయాడు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ వరంద న్ను కోరగా పరిశీలించి న్యాయం చేస్తానడంతో బాధిత కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఎట్టెం మల్లయ్య(67) ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి మృతి చెందినట్టు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 17న రాత్రి మల్లయ్య కనిపించకుండా పోయాడు. శుక్రవారం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో మల్లయ్య మృతదేహం గుర్తించారు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ యువతి..


రమ్య

పెగడపల్లి: మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి వద్ద ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో అలువాల రమ్య(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రమ్య ద్విచక్రవాహనంపై భర్త విష్ణుతో కలిసి పెగడపల్లి వైపు వెళ్తుంది. ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్రవాహనం వీరిని ఢీకొట్టింది. భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. రమ్య తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికిరణ్ చెప్పారు.

కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం అల్లమయ్యగుట్ట ప్రాంతంలో పరస్పరం దాడికి పాల్పడ్డ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అల్లమయ్యగుట్ట ప్రాంతానికి చెందిన నూనె రవి, కృష్ణయ్య మధ్య రూ.10 వేల అప్పు విషయంలో గొడవ జరిగింది. ఇంతలో కృష్ణయ్య కత్తితో రవిపై దాడికి పాల్పడగా మెడపై గాయం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వివరాలు సేకరించారు.

భాజపా నాయకుడి మృతికి సంతాపం

బుగ్గారం, న్యూస్‌టుడే: జ్వరంతో భాజపా బుగ్గారం మండల ప్రధాన కార్యదర్శి పంచిత లక్ష్మణ్(28) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సిరికొండ గ్రామానికి చెందిన లక్ష్మణ్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో లక్ష్మణ్ మృతి చెందాడు. దీంతో పలవురు సంతాపం తెలిపారు.


లక్ష్మణ్

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని టౌన్-2 పరిధిలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, విద్యానగర్, రాజీవ్‌బైపాస్, గాయత్రి దేవాలయం, గొల్లపల్లి రోడ్, తాతమ్మగుడి, విజయపురి, దయాల్‌నగర్, శంకులపల్లి, బీరయ్యగుడి, కొత్తవాడ, హనుమాన్‌వాడ, టవర్ సర్కిల్, ఖాజీపుర, సుతారిపేట, ఉస్మాన్‌పుర, వంజరివాడ, లడ్డూఖాజ చౌరస్తా, శివవీధి, అన్నపూర్ణ చౌరస్తా, మిషన్ కాంపౌండ్, తిప్పన్నపేట, పెర్కపల్లి, గోపాల్‌రావుపేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు. జగిత్యాల గ్రామీణ మండలం కల్లెడ ఉప కేంద్రంలో మరమ్మతు కారణంగా కల్లెడ, అనంతారం, తక్కల్లపల్లి, హబ్సీపూర్, సోమన్‌పల్లి గ్రామాల్లో, పొరండ్ల ఉప కేంద్రం పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి గ్రామాలల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు.

బీటుకు భారీగా మొక్కజొన్నలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు శుక్రవారం పెద్దఎత్తున మొక్కజొన్నలను విక్రయానికి తెచ్చారు. జగిత్యాలతో పాటుగా చుట్టుపక్కల మండలాల నుంచి రైతులు పెద్దఎత్తున మక్కలను తేగా కుప్పలతో యార్డు పూర్తిగా నిండిపోయింది. బీటులో మక్కలకు కనిష్ఠంగా రూ.1,500 నుంచి గరిష్ఠంగా రూ.2,411 వరకు ధరలు పలికాయి. సరాసరి ధర రూ.2,265గా నమోదైంది. కాగా మక్కలకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,225 కన్నా అధిక ధర పలుకుతున్నట్లు మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ-1010 రకం ధాన్యానికి రూ.1,841 నుంచి రూ.1,910 చొప్పున ధరలు లభించినట్లు వివరించారు.



జగిత్యాల బీటులో మక్కలను కుప్పగా పోస్తున్న రైతులు

మహిళలకు కుట్టుయంత్రాల పంపిణీ

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలం తాటిపల్లిలో కుట్టులో శిక్షణ పొందిన 20 మంది మహిళలకు శుక్రవారం ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు యంత్రాలు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం గ్రామంలోని 50 మంది మహిళలకు నాలుగు రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఎడిబుల్ ఆయిల్ సీఈవో సిద్ధాంత్‌లోహియా, ఆయిల్‌ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ రంగనాయకులు, మేనేజర్ విజయ్‌భరత్, ఉద్యానశాఖ మండల కన్వీనర్ అనిల్‌కుమార్ సేంద్రియ ఎరువులతో పండ్ల మొక్కలను పెంచుకునే విధానాలను వివరించారు. మాజీ ఎంపీపీ ఆనందరెడ్డి, సొసైటీ కోఆర్డినేటర్లు దీప్తి, నవ్య, వెలాంగిని, మర్రి మల్లేశం, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ సీసీ ప్రభాకర్, సీఏ రజని పాల్గొన్నారు.


కుట్టు యంత్రాలను అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులపై ప్రత్యేక దృష్టి

సారంగాపూర్, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించి మందులు అందించాలని జిల్లా వైద్యాధికారి షమీయొద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాగునూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లె పల్లె దవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీ జిల్లా సమన్వయకర్త మురళీ, సీహెచ్‌వో కుద్దూస్, పర్యవేక్షకులు కిశోర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తదితరుల పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి షమీయొద్దీన్

ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు ప్రభుత్వ భూముల సర్వేను ఆర్డీవో మధుసుదన్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాయికల్ పట్టణంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు సూచించారు. తహసీల్దార్ ఖయ్యూం, పట్టణ ప్రణాళిక అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నాం


రాయికల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

నిధుల మంజూరుపై సంబరాలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ నాయకులు మండలంలోని రంగపేటలో సంబరాలు జరుపుకున్నారు. రహదారి నిర్మాణానికి రూ.1.65కోట్లు మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కొంద్ర రాంచందర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, రామడుగు రవి, మాలెపు సుధాకర్, వాసం శ్రీనివాస్, పల్లపు నరేష్, ఏదుల శేఖర్, శిగుర్ల రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో సమస్యలు వివరిస్తున్న అధికారులు

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి వేదిక

ధర్మపురి, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పరిష్కార వేదికలను ఏర్పాటు చేసినట్లు సీజీఆర్ఎఫ్ ఛైర్ పర్సన్ నారాయణ తెలిపారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 8 సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. అప్పటికప్పుడే 2 సమస్యలను పరిష్కరించగా, 6 సమస్యలను అధికారులు నమోదు చేసుకున్నారు. సీజీఆర్ఎఫ్ సాంకేతిక సభ్యుడు రామక్రిష్ణ, ఆర్థిక సభ్యుడు కిషన్, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ సాలియా, డివిజనల్ ఇంజినీర్ రాజిరెడ్డి, ఎస్ఏవో తిరుపతి, ధర్మపురి ఏడీఈ సింధూర్ శర్మ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

వెల్గటూరు, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్య పరిరక్షణపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డా.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎండపల్లి మండలం అంబారిపేట, వెల్గటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. సిబ్బందితో జ్వరాలు, ఇతర వ్యాధుల పరిస్థితిపై సమీక్షించారు. వైద్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రత, జ్వరాల నియంత్రణ వంటి వాటిపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. సీహెచ్‌వో జగన్నాథం పాల్గొన్నారు.

కొండగట్టులో చిన్నారుల గుర్తింపు

మల్యాల: కరీంనగర్ జిల్లా మానకొండూరు బీసీ సంక్షేమ వసతి భవనం నుంచి పారిపోయిన ఆకుల నితీష్, ముద్దంగుల సాత్విక్ అనే ఇద్దరు విద్యార్థులను ఔట్‌పోస్టు ఏఎస్సై రమణారెడ్డి శుక్రవారం రాత్రి కొండగట్టు స్టేజి వద్ద పట్టుకున్నారు. వారిద్దరిని కొండపైకి తీసుకువెళ్లి భోజనం చేయించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. మానకొండూరు నుంచి పోలీసు సిబ్బంది కొండగట్టుకు చేరుకొని ఇద్దరు విద్యార్థులను తీసుకువెళ్లినట్లు ఏఎస్సై వివరించారు.

సంక్షిప్తం

ఆలయాల హుండీ లెక్కింపు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, సాయిరామ దేవాలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.86,506 నగదు, సాయిరామ ఆలయంలో రూ.2,26,886 నగదు, మిశ్రమ వెండి, బంగారం లభించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఈవోలు విక్రమ్, కాంతారెడ్డి, నర్సింహచారి, నర్సయ్య, గంగాధర్, రాజేంధర్, లక్ష్మి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతిపై అధికారుల విచారణ

కోరుట్ల: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ప్రశాంత్, ప్రణీత దంపతుల 10 నెలల చిన్నారి హితాన్షి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఆకుల శ్రీనివాస్ విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం సభ్యుల ఇంటికి వెళ్లి చిన్నారికి గల అనారోగ్యం, ఏఏ ఆసుపత్రిలో చికిత్స చేయించారో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా సర్వలెన్స్ అధికారి అతుల్, డా.సింధూజ, శ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

కోరుట్ల: కథలాపూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కథలాపూర్ మాడల్ స్కూల్‌రోడ్ మరమ్మతులకు రూ.1.30 కోట్లు, దూలూర్-తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.85 లక్షలు మంజూరుపై సంతోషం వ్యక్తం చేశారు. నాగరాజు, పులి హరిప్రసాద్, నారాయణరెడ్డి, వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి పట్టణం: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ సద్భావన రాష్ట్ర స్థాయి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్రవంతి నృత్య కళానికేతన్ సంస్థ వ్యవస్థాపకుడు అందె మారుతి బాపూజీ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 19న మెట్‌పల్లిలో నిర్వహించే కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం 99489 58815లో సంప్రదించాలని తెలిపారు.

సంఘాలు-నియామకాలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బూట్ల రాజమల్లయ్యను పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మల్యాల: కరీంనగర్‌లోని ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి నిర్వాహకులు శుక్రవారం కొండగట్టు ఆలయ ఈవో కార్యాలయ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది ఆలయ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారులతోపాటు, ఆసుపత్రి వైద్యులు అబ్దుల్‌రహమాన్, అర్షియా, ఆయేషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి రప్పించాలని ప్రవాసీ ప్రజావాణిలో వినతి

కొడిమ్యాల: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లె గ్రామానికి చెందిన కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరాముల అనుదీప్‌ను స్వగ్రామానికి రప్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనుదీప్ ఉపాధి నిమిత్తం కువైట్‌లో బైక్ రైడర్ ఉద్యోగంలో చేరగా కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడు. సోదరుడు అనిల్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి, అంబాసిడర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు బూట్ల వితరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు మాజీ ఉపసర్పంచి నల్ల తిరుపతి రెడ్డి, నాయకులు భైరి వెంకటస్వామి రూ.10వేల విలువ గల బూట్లను అందజేశారు. ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన కర్రె సంజీవరెడ్డి-సుజాత కుటుంబ సభ్యులు రూ.25,016 ఆర్థిక సహకారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండలం వెంపల్లి పురాతన శివాలయం అభివృద్ధికి రాయికల్ మండలం రామోజీపేట గ్రామానికి చెందిన జకిలేటి హరీష్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని రూ.11 వేల విరాళం అందజేశారు. బిట్ల నరేష్, దశరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చర్యలకు ఫిర్యాదు

జగిత్యాల పట్టణం: జిల్లాలోని ఇద్దరు మండల విద్యా అధికారులు, డీసీఈబీ కార్యదర్శి, జిల్లా సైన్స్ అధికారిల వైఖరి ఆక్షేపనీయంగా ఉందని జిల్లా యుఎస్పీసీ కమిటీ పాఠశాల ఆర్జేడీ వరంగల్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇలాంటి చర్యలు విద్యారంగంలో విపరీత పోకడలకు దారితీస్తాయని వీరిపై చర్యలు తీసుకోవాలని నాయకులు తిరుకోవెల శ్యాంసుందర్, ఎన్నం రాంరెడ్డి, దుమాల శంకర్, భూమేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు.

విద్యావేత్త రామకృష్ణయ్య జయంతి

జగిత్యాల ధరూర్‌క్యాంపు: విద్యావేత్త ముద్దు రామకృష్ణయ్య జయంతి వేడుకను మద్దు రామకృష్ణయ్య విద్యా సేవాసదన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాలలో నిర్వహించారు. రామకృష్ణయ్య చిత్రపటంవద్ద నివాళులర్పించారు. సేవాసదన్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివశంకర్, విశ్రాంత ఎంఈవోలు పెద్ది ఆనందం, సి.గంగాధర్, బాపురెడ్డి, దేవరశెట్టి జనార్దన్, వెంకటరమణ, కనకతార, తదితరులు పాల్గొన్నారు.

దీక్ష పోస్టర్ల ఆవిష్కరణ

జగిత్యాల వాణిజ్యం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అమలు కోరుతూ ఈ నెల 21న హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసనదీక్ష పోస్టర్లను జగిత్యాలలో శుక్రవారం ఆవిష్కరించారు. పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాయల లక్ష్మీనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు గడ్డం మధు, గజ్జెల జనార్దన్, గడ్డం కరుణ్, గజ్జెల వెంకటేశ్, మురళి, నరేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

సారంగాపూర్: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో యువకులకు మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలపై యువకులకు అవగాహన కల్పించారు. మండలంలోని రేచపల్లి యువకులు వాలీబాల్ విజేతగా నిలవడంతో పోలీసులు అభినందించారు. ఎస్సై దత్తాద్రి, పీడీ రవికుమార్, శ్రీనివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారుల నియామకం

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జిల్లాలోపశువైద్య ఆసుపత్రులకు నూతన పశువైద్యాధికారులను ప్రభుత్వం నియమించగా విధుల్లో చేరారు. కల్లెడ ఆసుపత్రికి డాక్టర్ బోనగిరి వసుపావని, కొడిమ్యాలకు రాకేశ్, పెగడపల్లికి హేమలత, ధర్మపురికి వేణుగోపాల్, ఎండపల్లి మండలం మారేడుపల్లి ఆసుపత్రికి మనోజ్‌కుమార్‌ను నియమించారని జిల్లా పశువైద్య అధికారులు తెలిపారు.

గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుగా రాంప్రసాద్



కోరుట్ల: తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుగా కోరుట్ల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చౌడారపు రాంప్రసాద్‌ను శుక్రవారం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. గణిత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఆరోగ్య సేవలపై అవగాహన

ధర్మపురి గ్రామీణం: ఆరోగ్య సేవలపై ప్రతిమ ఫౌండేషన్, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దొంతాపూర్‌లో గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణ నైపుణ్యాలు, ఆస్పత్రి ఉచిత సేవలపై అవగాహన కల్పించారు. మండల కోఆర్డినేటర్ రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్గటూరు: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు రాంనూరులో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ దుర్గయ్య తెలిపారు. రూ.51 వేల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. భూమయ్య, వెంకటేశ్, శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధ్యునిపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: జిల్లా పరిషత్తు అధికారులు, ఉద్యోగులపై సామాజిక మాధ్యమంలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో బి.గౌతంరెడ్డి, ఉద్యోగులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జడ్పీ అధికారులు, మహిళా ఉద్యోగులపై వ్యక్తిగతంగా అసభ్యకరమైన ఆరోపణలతో అసత్యమైన వీడియో రూపొందించి ప్రచారం చేశారని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు నిరసనతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తామని లేఖలో పేర్కొన్నారు.

కుమురం భీంకు నివాళి

రాయికల్ పట్టణం: పట్టణంలో కుమురం భీం వర్ధంతిని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఖయ్యూం, ఆత్రం రవీందర్, ప్రమోద్, నాగేందర్, అభిలాష్, సతీష్, వినోద్, మల్లేష్ పాల్గొన్నారు.


రాయికల్‌లో నివాళులర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు